క్లుప్తంగా

ఆర్‌బీకేల సేవలు సద్వినియోగం చేసుకోండి

గోనెగండ్ల: ఆర్‌బీకేల్లో అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత సూచించారు. బుధవారం వారు మండలంలోని పెద్దనేలటూర్‌లోని 1, 2, అలువాల గ్రామంలోని ఆర్బీకేలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు సాగుచేసిన పంటలను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు సెప్టెంబర్ 15లోపు పంట నమోదు చేయించుకుని ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందాలని సూచించారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి



అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ కలెక్టర్ రమ

మద్దికెర: ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిందని సంబంధిత అధికారులు అభివృద్ధిపై దృష్టి సారించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన వారందరికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్ నాగ భూషణంకు సూచించారు. జగనన్న కాలనీలలో ఏ మేరకు ఇంటినిర్మాణాలు జరుగు తున్నాయని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. నాడు–నేడు రెండవ విడత పనులు పూర్తి చేయాలని ఎంఈఓ రంగస్వామిని ఆదేశించారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి, ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి, సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు పాల్గొన్నారు.

నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి

ఆస్పరి: నర్సరీలు నిర్వహించే యజమానులు తప్పకుండా లైసెన్స్ తీసుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజినేయులు హెచ్చరించారు. బుధవారం ఆస్పరిలోని నర్సరీలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలలో మొక్కలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. మండలంలో లైసెన్స్ లేని వారు వారం రోజుల్లోపు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది ఇందిర, జ్యోతిర్మయి ఉన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

చిప్పగిరి: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా చిప్పగిరి జగనన్న కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పీడీ, మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి ఉండేలా చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. బీఎల్ ఉన్న వాటిని రూఫ్ లెవల్‌కు, రూఫ్ లెవల్ వాటిని ఆర్‌సీకి, ఆర్‌సీ ఉన్న వాటిని కంప్లీషన్ దశకు తీసుకొచ్చేలా కృషి చేయాలన్నారు. ఆయా నిర్మాణ దశలను బట్టి బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నామన్నారు. ఎంపీడీఓ కొండయ్య, పంచాయతీ కార్యదర్శి నాగభూషణం తదితరులు ఉన్నారు.

ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ

వెల్దుర్తి: రైతులకు వ్యవసాయం, అనుబంధ విస్తరణ సేవలను అందించే స్వయం ప్రతిపత్తి సంస్థ 'ఆత్మ' ఆధ్వర్యంలో మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో రైతులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆర్బీకేలో జరిగిన కార్యక్రమానికి బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ, కర్నూలు శిక్షణా కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ శశిధర్ రెడ్డి, స్థానిక ఏఓ అక్బర్ బాషా, ఆత్మ బీటీఎం చక్రవర్తి నాయక్ మాట్లాడుతూ.. వివిధ పంటలపై ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పాత రకాలకు స్వస్తి పలికి అధిక దిగుబడులనిచ్చే కొత్త రకం విత్తనాలను ఎంచుకోవాలన్నారు. పత్తి పంటలో గులాబీ పురుగు పట్ల అప్రమత్తతపై సూచనలిచ్చారు. ప్రస్తుతం అన్ని ఆర్బీకేలలో సర్టిఫైడ్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ పరిధిలో సాగైన పత్తిపంటను పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఆర్బీకేల సిబ్బంది లింగన్న, స్వరూప, శ్రీకాంత్, మధు పాల్గొన్నారు.

త్వరలో గ్రంథాలయ ప్రారంభం

వెల్దుర్తి: పట్టణంలో నిర్మాణం పూర్తయిన నూతన గ్రంథాలయ భవనాన్ని త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ప్రకాశ్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, పుస్తకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రంథాలయాధికారి కవితా బాయ్, గ్రంథాలయాభివృద్ధి కమిటీ సభ్యుడు హరిసింహనాయుడుతో కలిసి కర్నూలు రోడ్డులో 90 శాతం పనులు పూర్తి చేసుకున్న నూతన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. ఇటీవలే పెండింగ్ బిల్లులు సైతం మంజూరు చేసినట్లు, కాంట్రాక్టర్లు మిగతా పనులు త్వరగా పూర్తిచేసి అప్పగించేలా ఆదేశించినట్లు తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి

నందవరం: ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను ఆర్బీకే సిబ్బంది పక్కాగా పంట నమోదు చేపట్టాలని ఏఓ మత్రి స్రవంతి సూచించారు. బుధవారం మండలంలోని నదికై రవాడి గ్రామంలో ఈ క్రాప్ బుకింగ్‌ను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో ప్రస్తుతం 25 శాతం పంట నమోదు పూర్తయ్యిందని, దాదాపు 35 వేల ఎకరాలలో పంట నమోదు చేపట్టాలన్నారు. వచ్చే నెల ఆఖరులోపు క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తి కావాలని సూచించారు. ఎంఈఓ ప్రభావతి, వీఏఏలు విజయ్, దివ్య తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- మంత్రి గుమ్మనూరు జయరాం
- ఓటమి భయంతోనే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కుట్రలు
- ఆ రెండు పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధమైన ప్రజలు



ఇంటి పట్టాను అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

దేవనకొండ: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం అని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ ఓటమి భయంతోనే కుట్రలు చేస్తున్నారని, టీడీపీ, జనసేన పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు మెచ్చిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని, ప్రజా మద్దతు తమ పార్టీకే ఉందన్నారు. బుధవారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రూ.80 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం–1, 2 భవనాలను మంత్రి ప్రారంభించారు. పొట్లపాడు గ్రామ రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల పాలనలో తెర్నేకల్ గ్రామ పంచాయతీ పరిధిలో రూ.24 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తెల్లవంక వాగు డ్రెయినేజీ నిర్మాణానికి రూ.30 లక్షలు, గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.15 లక్షలు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కుల మత పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మంత్రి సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ కిట్టు, నాయకులు మల్లికార్జున, ఉమ్మంబా, కబీర్‌దాసు, సర్పంచ్ అరుణ్‌కుమార్, నామాల శ్రీనివాసులు, ఈరన్న, దివాకర్‌నాయుడు, మోహన్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ గౌరీదేవి, తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు సైతం ప్రభుత్వ పథకాలు

ఆలూరు: తెర్నేకల్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి గుమ్మనూరు జయరాం జనసేన ఆలూరు నియోజకవర్గ నేత వెంకప్ప ఇంటికి వెళ్లి ఆయన తల్లి లక్ష్మమ్మతో ఆప్యాయంగా మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీయగా తనకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయని ఆమె సమాధానం చెప్పింది. మంత్రి మాట్లాడుతూ.. గత టీడీపీ పాలనలో ఆ పార్టీ వారికి, జన్మభూమి కమిటీ సభ్యులకు మాత్రమే పథకాలు అందేవని, జగనన్న పాలనలో అర్హతే ప్రామాణికంగా కుల, మత పార్టీ భేదాల్లేకుండా ప్రతిఒక్కరికీ పథకాలు అందుతున్నాయని వివరించారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.



తెర్నేకల్‌లో వృద్ధుడితో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

25 వరకు ఆధార్ క్యాంపులు

తుగ్గలి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 25వ తేదీ వరకు మండల పరిధిలోని సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ సావిత్రి బుధవారం తెలిపారు. 24న పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్‌ఎస్, ముక్కెల్ల, కడమకుంట్ల, 25న పగిడిరాయి, మారెల్ల, రాతన, శభాష్‌పురం సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ క్యాంపులను నిర్వహిస్తామన్నారు. ఆధార్ డాక్యుమెంట్ల అప్‌డేట్, పిల్లలకు ఆధార్ నమోదు జారీ చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

26న సామాజిక తనిఖీ

ఆస్పరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈనెల 26వ తేదీన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ బుధవారం తెలిపారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో 1.4.2022 నుంచి 31.3.2023 మధ్య కాలంలో జరిగిన ఉపధి పనులపై ఈనెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు గ్రామాలలో సామాజిక తనిఖీలు, గ్రామ సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పనులపై అభ్యంతరాలుంటే ప్రజా వేదికలో చెప్పవచ్చన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధి కూలీలు, రైతులు హాజరు కావాలన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



రైతులకు పంప్‌సెట్ సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రైతుల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం తన నివాసం వద్ద వైఎస్సార్ జలకళ కింద మంజూరైన బోర్ల పంప్‌సెట్ల సామగ్రిని ఏనుగుబాల, కడివెళ్ల గ్రామాలకు చెందిన రైతులు మంగలి రామాంజినేయులు, నీలకంఠ, పరుశురాముడులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయానికి సాగునీరు లేక ఇబ్బంది పడే చిన్న సన్నకారు రైతుల భూముల్లో ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకం కింద ఉచితంగా బోర్లు వేసి పంప్ సెట్ సామగ్రిని అందిస్తుందన్నారు. తద్వారా రైతులకు సాగునీటి కష్టాలు తీరనున్నాయని పేర్కొన్నారు. ఎంపీపీ కేశన్న, ఏపీడీ ఆలీపీరన్, ఎంపీడీఓ బంగారమ్మ, ఏపీఓ విజయ్‌మోహన్, సీటీఏ బషీర్, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వినయ్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కుట్ర రాజకీయాలు టీడీపీకే చెల్లు



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పత్తికొండటౌన్: కుట్ర రాజకీయాలు చేయడం టీడీపీ నాయకులకే చెల్లు అని, నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిపై అనుచిత ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఎంపీపీ ఎం.నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అటికెలగుండు బాబురెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పత్తికొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేపై టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలను ఖండించారు. ఈనెల 10న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పుచ్చకాయలమాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడితే ప్రజలందరూ స్వాగతించారన్నారు. అయితే టీడీపీ నాయకులు వారి అనుచరులతో రాళ్లు వేయించి, గొడవలు సృష్టించేందుకు కుట్రలు చేశారని, ఎమ్మెల్యే సంయమనం పాటించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు నచ్చజెప్పి గొడవలు జరగకుండా చూశారని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరించిన వారిపై సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన టీడీపీ నాయకులు అమాయకులను రెచ్చగొడుతూ, కుట్రలకు పాల్పడుతూ నీచరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు.. పుచ్చకాయలమాడ అల్లర్ల కేసులో నిందితులను పోలీస్‌స్టేషనుకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపితే టీడీపీ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకోవడం, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం చూస్తే వారికి ప్రజాస్వామ్యంపై ఎంత విశ్వాసం ఉందో అర్థం అవుతుందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తగిన బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, మండల కన్వీనర్ కారం నాగరాజు, నాయకులు సోమశేఖర్, భాస్కర్‌నాయక్, అంజినయ్య, గాంధీ రెడ్డి, కృష్ణ, శ్రీను, నాగరాజు, మోహన్, రవిరెడ్డి, రవికుమార్, రంగానాయక్ పాల్గొన్నారు.

ఓటరు సర్వే 92 శాతం పూర్తి

ఆలూరు రూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటరు సవరణ సర్వే ఈ నెల 18వ తేదీ నాటికి 92 శాతం పూర్తయినట్లు హాలహర్వి మండల తహసీల్దార్ మల్లికార్జున అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓ సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. గత నెల 21వ తేది నుంచి చేపట్టిన ఓటరు జాబితా సవరణలో భాగంగా బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, మార్పులు,చేర్పులుకు సంబంధించిన ఫారాలను స్వీకరించారన్నారు. మరణించిన వారి ఓట్లు, గ్రామం విడిచి ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన ఓటర్లను తొలగించారన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 2,634 కొత్త ఓటరు ఫారాలు స్వీకరించి, 1,047 మంది మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లు గుర్తించామన్నారు. 3,453 మంది ఓటర్లు అడ్రస్ మార్పులు, పేర్లు మార్పులు చేశామన్నారు. ఈ నెల చివరిలోగా సర్వే పూర్తి చేస్తామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్లు హుసేన్ సాహెబ్, లక్ష్మీనారాయణ ఎన్నికల డీటీ గుండాల్‌నాయక్, ఆలూరు డీటీ విజయ్‌కుమార్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడ్ తదితరులు హాజరయ్యారు.

నిట్రవట్టి గ్రామ సచివాలయం తనిఖీ



సచివాలయ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాసు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామ సచివాలయాన్ని బుధవారం పత్తికొండ ఆర్డీఓ మోహన్ దాసు తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న రీ–సర్వే గురించి ఆరా తీశారు. విధుల పట్ల సచివాలయ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు కృషి చేయాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. డీఐఓఎస్ భాస్కర్, తహసీల్దార్ మల్లికార్జున, రీసర్వే డీటీ బ్రహ్మయ్య, వీఆర్వో ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతో నిరంతర సంక్షేమం



మాట్లాడుతున్న తెర్నేకల్ సురేందర్ రెడ్డి

దేవనకొండ: కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని శ్రీశైలం నియోజకవర్గ అబ్జర్వర్ తెర్నేకల్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తెర్నేకల్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు అధికారం నుంచి దిగిపోయే నాటికి రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, ఆ అప్పులను తగ్గించేందుకు సీఎం జగనన్న శాయశక్తులా కృషి చేశారన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమల స్థాపన, సాఫ్ట్‌వేర్ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారని వివరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. సంక్షేమ సారథి వైఎస్ జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మంత్రి గుమ్మనూరు జయరాం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లు

ఆలూరు రూరల్: ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మూడవ విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సూరప్ప బుధవారం ప్రకటనలో వెల్లడించారు. 2023–24 సంవత్సరంలో ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఈ నెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు స్థానిక ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీన ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం



రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సోమప్ప మెమోరియల్ హాల్‌లో 'సామాజిక న్యాయం– జగనన్నతోనే సాధ్యం' అనే అంశంపై అన్ని సామాజిక వర్గాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం చేశారన్నారు. 56 బీసీ కార్పొరేషన్లు ప్రవేశపెట్టి చైర్మన్లను నియమించి న్యాయం చేకూర్చారని వివరించారు. బడుగు బలహీన వర్గాల రాజకీయ, సామాజిక, ఆర్థిక భవిష్యత్ కోసం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలంతా ఐక్యమై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని అప్పుడే అందరి భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్న నేత సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు హయాంలో ఏ వర్గానికి ఏ రంగంలోను సముచిత స్థానం ఇవ్వలేదని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీ కులానికి చెందిన గుమ్మనూరు జయరాంను రాష్ట్ర మంత్రిగా, డాక్టర్ మధుసుదన్‌ను ఎమ్మెల్సీగాను, బీవై రామయ్యను కర్నూలు నగర మేయర్‌గాను, తనను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎంపిక చేశారని, ఎందరో బీసీలను రాజకీయ పదవులు ఇచ్చి తగిన గుర్తింపు నిచ్చారన్నారు. లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ బుట్టారంగయ్య, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దయ్య, నాయకులు దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య, ఎల్.వెంకటేశ్వర్లు, రాంభీంనాయుడు, దస్తగిరినాయుడు, వెంకన్న, మురళినాయుడు, రామాంజినేయులు, రాజారత్నం, అంపమ్మ, శివప్రసాద్ మాట్లాడారు.

బీసీలకు గుర్తింపునిచ్చిన నేత సీఎం జగన్



బీసీలకు తగిన గుర్తింపునిచ్చి అందలం ఎక్కించిన నేత సీఎం వైఎస్ జగన్. రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలను ఆదుకొనేందుకు కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలుచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే బీసీలకు రాజకీయంగా పదవులు లభించాయి.

– బుట్టారంగయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్, ఎమ్మిగనూరు

బీసీ కార్పొరేషన్లతో న్యాయం



బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యత ఇచ్చే తలంపుతో సీఎం వైఎస్ జగన్ 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించారు. ఇలా ఏ ముఖ్యమంత్రి బీసీలకు గుర్తింపునిచ్చిన దాఖలాలు లేవు. అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేసింది వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం మాత్రమే.

– రుద్రగౌడ్, రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్

సేంద్రియ ఎరువులను వాడాలి

గోనెగండ్ల: రైతులు సాగు చేసిన పంటలకు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి పెట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ మాధురి, హేమలత, స్వప్న అన్నారు. బుధవారం హెచ్. కైరవాడి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగుచేస్తే భూసారం పెంచే వానపాములు తయారవుతాయన్నారు. భూసారం పెరగడంతో పంట దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. మంచి దిగుబడులు పొందేందుకు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలని సూచించారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

నందవరం: గురజాల గ్రామానికి చెందిన కౌలు రైతు కురవ భీరప్ప ఈ నెల 19న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. బుధవారం ఆర్ఐ జెర్మియా, ఏఈఓ సురేంద్రగౌడ్ రైతు ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. ఆయన కౌలుకు తీసుకున్న పొలం, సాగు చేసిన పంటలు, ప్రైవేటు అప్పులు, బ్యాంకు అప్పులపై విచారించారు. తుది నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని అధికారులకు తెలిపారు. వీహెచ్‌ఏ వెంకటేష్, మృతుడి భార్య కురువ దస్తగిరమ్మ తదితరులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

హొళగుంద: మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన శేఖన్న (22) మంగళవారం రాత్రి అనారోగ్యంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సదరు యువకుడు 12 ఏళ్ల వయసులో పోలియో బారిన పడ్డాడు. అప్పటి నుంచి తరచూ నరాలు బిగుసుకుపోవడం, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతుండేవి. ఈ క్రమంలో నెలన్నర క్రితం కర్ణాటక రాష్ట్రం దానాళ్‌కు చెందిన లక్ష్మీతో వివాహం జరిగింది. అనారోగ్య సమస్యలతో మానసిక వేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నీటి విడుదలపై హర్షం

చిప్పగిరి: హంద్రీ–నీవా కాలువకు ప్రభుత్వం నీటిని విడుదల చేయడంపై ఎంపీపీ జూటూరు హేమలత హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. వరుణ దేవుడు ముఖం చాటేయడంతో సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయన్నారు. ప్రభుత్వం హంద్రీ నీవాకు నీటిని విడుదల చేయడంతో ఏబీసీ కెనాల్ కింద పంటలకు నీరు పెట్టుకునే అవకాశం ఏర్పడిందని, పైర్లకు జీవం పోసినట్లు అయ్యిందన్నారు. నీటి విడుదలతో మండలంలోని ఏరూరు, డేగులహాలు, కాజీపురం, రామదుర్గం నగరడోణ, తిమ్మాపురం, తదితర గ్రామాల రైతులకు మేలు కలుగుతుందన్నారు. నాయకులు మారయ్య, లాల్ స్వామి పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత

కృష్ణగిరి: మండల పరిధిలోని పెనుమాడ గ్రామానికి చెందిన హరిజన మాధవి అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం మృతి చెందింది. బుధవారం బాధిత కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలను వైఎస్సార్‌సీపీ నాయకులు బార ఈశ్వరయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ నరేష్‌తో కలిసి అందజేశారు.

బాల్య వివాహాలతో భవిష్యత్ నాశనం



తుగ్గలిలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

తుగ్గలి: బాల్య వివాహాలతో భవిష్యత్ నాశనమవుతుందని కర్నూలు డీఎల్‌డీఓ, గ్రామ వార్డు సచివాలయాల ఇన్‌చార్జ్ అధికారి బాలకృష్ణారెడ్డి అన్నారు. బాల్య వివాహాల నిషేధంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల పుట్టే పిల్లల్లో మానసిక రుగ్మతలు, రక్తహీనతతో పాటు ఎన్నో అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చట్టరీత్యా స్త్రీలకు 18, పురుషులకు 21 సంవత్సరాలు నిండితేనే వివాహాలకు అర్హులన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు పిల్లలను కచ్చితంగా చదివించాలన్నారు. ప్రభుత్వం కూడా కళ్యాణమస్తు, షాదీతోఫా ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.75 వేలు, ముస్లింలకు రూ.లక్ష, భవన నిర్మాణ కార్మికులకు రూ.40 వేలు అందజేస్తుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లయితే చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాలన్నారు. తహసీల్దార్ రవి, ఎంపీడీఓ సావిత్రి, ఎంఈఓ మాలతి, ఎస్ఐ మల్లికార్జున, ఐసీడీఎస్ సిబ్బంది, వీఆర్వోలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు



కురవ రాఘవేంద్ర (ఫైల్)



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీస్ అధికారులు

నందవరం: మంత్రాలయం సమీపంలోని గోశాల వద్ద మంగళవారం జరిగిన బైక్ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం విధితమే. అందులో మాధవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోయ గోవిందు (25), మరో వ్యక్తి నందవరం మండలం ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కురవ రాఘవేంద్ర (35) దుర్మరణం చెందారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. బుధవారం కానిస్టేబుల్ మృతదేహాన్ని ఇబ్రహీంపురం గ్రామానికి తీసుకువచ్చారు. డీఎస్పీ సీతారామాంజనేయులు, సీఐలు మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎరిషావలి, ఎస్ఐలు తిమ్మయ్య, ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసు లాంఛనాలలో భాగంగా గాలిలో తుపాకులు పేల్చి గౌరవ వందనం సమర్పించారు. రోడ్డు ప్రమాదం రూపంలో రాఘవేంద్ర మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు, భార్య పిల్లల రోధనలు మిన్నంటాయి. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య శివమ్మతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఘనంగా ఉరుసు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ గంజిహళ్లి బడేసాహెబ్ స్వామి వారి పెద్ద ఉరుసు బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో ఈ ఉరుసును భక్తులు ఘనంగా నిర్వహిస్తారు. ఈ మాసంలోనే స్వామివారు జీవసమాధి అయ్యారని పీఠాధిపతి చిన్న ముద్గోల్ స్వామి తెలిపారు. ఉరుసు సందర్భంగా జీవ సమాధిని పూలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. పార్లపల్లి గ్రామానికి చెందిన త్రివిక్రం రెడ్డి, ప్రతాపరెడ్డి, అరం జ్యోతిలు మొక్కుబడిలో భాగంగా రూ.70 వేలు విలువ చేసే వెండి పాదుకలను పీఠాధిపతి సయ్యద్ చిన్న ముద్గోల్, ధర్మకర్త కుబేరరెడ్డి సమక్షంలో స్వామి జీవసమాధికి అమర్చారు.

పొలంబడితో ప్రయోజనం

హాలహర్వి: పొలంబడి ద్వారా పర్యావరణాన్ని రక్షించడం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం సాధ్యపడుతుందని ఏఓ శివశంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం బిలేహాల్ గ్రామంలో రైతు గంగాధర్ గౌడ్‌కు చెందిన పత్తి పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పంట విశ్లేషణ కార్యక్రమం రైతులతో చేయించారు. రైతులు, వీఏఏ రాజేంద్ర పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

ఆలూరు రూరల్: ఆలూరు పోలీసు సర్కిల్ పరిధిలోని ఆలూరు, హొళగుంద, హాలహర్వి, ఆస్పరి పోలీసు స్టేషన్‌లో పరిధిలో అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను శుక్రవారం ఆలూరు పోలీసు స్టేషన్ ఆవరణంలో పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి సమక్షంలో వేలం వేయనున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు బుధవారం వెల్లడించారు. నాలుగు స్టేషన్ల పరిధిలో 47 ద్విచక్రవాహనాలు, 5 కార్లు, 2 మినీ వెహికల్స్, ఒక ఆటోను వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు రూ.3 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

కురుబలకు ప్రాధాన్యతనివ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: రానున్న ఎన్నికల్లో కురుబ, కురుమలకు రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వాలని, కర్నూలు పార్లమెంట్ సీటుతో పాటు జిల్లాలో రెండు ఎమ్మెల్యే స్థానాలను అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు కోరారు. బుధవారం పట్టణంలోని గురుకోచింగ్ సెంటర్‌లో కురుబ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో కురువలను ఐక్యం చేసేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీల అధినేతలను కలిసేందుకు కమిటీని ప్రకటించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.